సాక్షి
బాపట్ల
బుధవారం ; 26 ; జూలై ; 2023



మంచినీటి చెరువు పరిశీలన

సత్తెనపల్లి: సాగర్ జలాలు విడుదల, వర్షాల నేపథ్యంలో పట్టణంలోని మంచినీటి చెరువును మంగళవారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పరిశీలించారు.



జడ్జిని నియమించాలి

బాపట్ల: బాపట్లకు రెగ్యులర్ ప్రిన్సిపల్ జూనియర్ జడ్జిని నియమించాలని హైకోర్టు న్యాయమూర్తి డీవీఎస్ఎస్ సోమయాజులకు మంగళవారం బార్ అసోసియేషన్ విన్నవించింది.

ఘనంగా పీర్ల ఊరేగింపు



క్రోసూరు: మొహర్రం మాసం పురస్కరించుకుని ముస్లింలు పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దొడ్లేరులో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గ్రామంలో ఊరేగించారు.

న్యూస్‌రీల్

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు జమచేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎం.విజయభాస్కరరెడ్డి మంగళవారం తెలిపారు. మొత్తం 28 మండలాలకు రూ.17కోట్ల 77 లక్షల 4 వేల 280 జమయ్యాయని పేర్కొన్నారు. ఆయా గ్రామాలకు జమ చేసిన నిధులను సంబంధిత ఖాతాల్లో పరిశీలించుకోవచ్చని వివరించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ పరిశీలనకు తమిళనాడు బృందం



మేడికొండూరు: జంగంగుంట్లపాలెంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం తమిళనాడు పర్యవేక్షణ బృందం సందర్శించింది. విలేజ్ హెల్త్ క్లినిక్ పనితీరు, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి బృందం పరిశీలన జరిపింది. రోగులను వివరాలు అడిగి తెలుసుకుంది. 104 వాహనం పనితీరు పైనా ఆరా తీసింది. బృందంతోపాటు గోవిందరావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, డీపీఎంఓ సి.హెచ్.రత్నమనోహన్, ఎన్‌హెచ్‌ఎం డాక్టర్ అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌లో ఓపీ వేళలు మార్పు



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అవుట్‌పేషెంట్ విభాగంలో రోగుల పేర్లు నమోదు చేసుకునే వేళల్లో మార్పులు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఓపీ విభాగంలో కొత్తగా పది ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో ఇప్పటి వరకు కేవలం ఆరు ఓపీ కేంద్రాలు ఉన్నాయని, ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య 2 వేల నుంచి 3 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎక్కువ సమయం రోగులు వేచి ఉండటం వల్ల సకాలంలో వైద్య సేవలు పొందలేకపోతున్నారని, దీన్ని నియంత్రించేందుకు కొత్తగా పది ఓపీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రాలను రోగులకు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. త్వరితగతిన అదనపు ఓపీ కేంద్రాలను నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పిల్లలతో తల్లి అదృశ్యం



తెనాలిరూరల్: పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన 29 ఏళ్ల బెజవాడ అనూష తన తొమ్మిదేళ్ల కుమారుడు షణ్ముఖసాయి, మూడేళ్ల కుమార్తె వన్సికని తీసుకుని సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త సీతయ్య మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో అనూష పిల్లలతో కలిసి వెళ్లిపోయినట్టు భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

దుర్గగుడికి డబ్బు చెల్లించండి

ముగ్గురు ఉద్యోగులకు ఈఓ నోటీసులు!

విజయవాడ: ఇంద్రకీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో 2017, 2019 సంవత్సరాల్లో జరిగిన చీరల గోల్‌మాల్ వ్యవహారం మరోమారు కదిలింది. దేవస్థానం అప్పట్లో భక్తుల నుంచి చీరల సేకరణ, విక్రయాలతో పాటు గోదాములో స్టాక్ నిల్వ చేసింది. ఆ సమయంలో ఈ వ్యవహారాలను ముగ్గురు ఉద్యోగులు చూశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరగడంతో అప్పట్లోనే విషయం బయటకు వచ్చింది. ఉద్యోగులపై దేవదాయ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. అవకతవకలు జరిగిన మొత్తాన్ని చెల్లించాలంటూ దేవస్థానం గతంలోనే నోటీసులు జారీ చేసింది. తాజాగా మంగళవారం మరో మారు ఈ వ్యవహారంపై దుర్గగుడి ఈఓ భ్రమరాంబ దృష్టి సారించారు. గోల్‌మాల్ జరిగిన మొత్తాన్ని తిరిగి దేవస్థానానికి చెల్లించాలని ముగ్గురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం రూ.1.66 కోట్లు, రికార్డ్ అసిస్టెంట్ రమేష్ రూ.20 లక్షలు, మరో ఉద్యోగి మధు రూ.6 లక్షలు చొప్పున పది రోజుల్లో చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

పల్లెె నాడి దొరికింది..

పల్లెకు కార్పొరేట్ వైద్యం వచ్చింది.. ఒకప్పుడు మందుబిళ్ల కోసం అవ్వాతాతల వెతుకులాట.. గర్భిణిల ప్రసవవేదన.... చిన్నారుల ఆర్తనాదాలు.. దీర్ఘకాలిక వైద్యం అందితే ఒట్టు.. జబ్బు చేస్తే మైళ్ల దూరంలోని ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి.. అంత దూరం వెళ్లినా సకాలంలో వైద్యం అందుతుందనే నమ్మకం లేదు.. సర్కారీ దవాఖానా ఉంటే వైద్యులు ఉండేవారు కాదు.. వైద్యులు ఉంటే మందులు ఉండేవి కావు.. ఎలాగోలా ఏరియా ఆస్పత్రికి వెళ్తే జిల్లా ఆస్పత్రికి వెళ్లాలంటూ సూచనలు.. ఇందంతా మనమెరిగిన గతం.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ వైద్య రంగం ఆధునికత సంతరించుకుంది.. విలేజ్ క్లినిక్‌లతో ఇంటి ముంగిటకే కార్పొరేట్ వైద్యం వచ్చేసింది.. నిరుపేదలకూ ఉచిత వైద్యం అండగా నిలిచింది..

- వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లతో పేదలకు వైద్యం
- 'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే సేవలు
- వైద్య సేవలపై ప్రజల హర్షం



'ఈ ఫొటోలో కనిపిస్తున్న గర్భిణి జి.అఖిలా. చెరువు జమ్ముల పాలెం గ్రామం. ఆమెకు ప్రస్తుతం ఎనిమిదో నెల. భర్త వ్యవసాయం చేస్తాడు. ప్రైవేట్ వైద్యం ఖర్చులు భరించడం కష్టం. హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం నుంచి ఏఎన్‌ఎం పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది. ప్రతి నెల వైద్యులు పరీక్ష చేస్తున్నారు. 4 నెలల వరకు ఫోలిక్‌యాసిడ్ బిళ్లలు ఇచ్చారు. ఐదో నెల నుంచి ఐరన్ బిళ్లలు ఇస్తున్నారు. ప్రతి నెల 9వ తేదీ పీఎంవీవై ప్రొగ్రామ్ కింద పరీక్షలు చేస్తున్నారు'. అవసరమైతే ఉన్నత పరీక్షల కోసం స్కానింగ్ సెంటర్లు కూడా తీసుకెళ్తామని ఏఎన్‌ఎం చెప్పినట్లు అఖిలా చెబుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన వైద్యం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉందని సంతోషం వ్యక్తం చేసింది.



ఈమె వైఎస్సార్ కాలనీకి చెందిన బి.వెంకాయమ్మ. వయసు 62. కాళ్లు నొప్పులతో బాధపడుతోంది. ఎక్కువ దూరం నడవలేకపోతోంది. ఇతర సాయంతో ఆస్పత్రికి వెళ్లాల్సివచ్చేది. ప్రస్తుతం అమలు చేస్తున్న విలేజ్ క్లినిక్‌లతో ఇంటి వద్దకే వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారు. గతంలో నేను బాపట్ల ఏరియా ఆస్పత్రికి వెళ్లేదానిని. ప్రస్తుతం మా ఊరి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో చికిత్స అందిస్తున్నారు. సంతోషంగా ఉంది.



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో భాగంగా ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న వైద్యుల బృందం



బాపట్ల: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రజలకు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తోంది. బాపట్ల జిల్లాలో 363 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఉన్నాయి. క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ అర్హత ఉన్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) సీహెచ్ఓ, ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు అందుబాటులో ఉంటారు.

హెల్త్ క్లినిక్స్ నిర్వహణ ఇలా...

- ప్రతిరోజూ అక్కడికి వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇస్తారు.
- జాతీయ , రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువ చేస్తున్నారు.
- గర్భిణులు, బాలింతలకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా హెల్త్ క్లినిక్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.
- ఆ హెల్త్ క్లినిక్ పరిధిలోని అంగన్‌వాడీలు, పాఠశాలలను సందర్శిస్తూ అక్కడ అనారోగ్యం , రక్తహీనత, ఎదుగుదల లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వైద్యం పొందేలా చూస్తారు.
- తాగునీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ, క్లోరినేషన్ వంటి వాటిని పరిశీలిస్తారు.

- పారిశుద్ధ్యం, దోమల నివారణ వంటి కార్యక్రమాలతో పాటు, డ్రైడే ఫ్రైడేకు కృషి చేస్తున్నారు.
-వారంలో రెండు రోజులు బుధ, శనివారాల్లో ఇమ్యునైజేషన్ ప్రొగ్రామ్ నిర్వహిస్తారు.
-ఇక్కడి ఎంఎల్‌హెచ్‌పీలకు అత్యవసర వైద్యం, బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై శిక్షణ ఇచ్చారు.

ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్ సేవలు...

ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉండే ఇద్దరు వైద్యుల్లో ఒకరు ప్రతి గ్రామానికి 104 వాహనంలో వెళ్లి ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు. జిల్లాలో 104 వాహనాలు 32 అందుబాటులో ఉన్నాయి. నెలలో 26 రోజులు పాటు ప్రతి గ్రామానికి వెళ్తారు.

నిపుణుల ద్వారా టెలి మెడిసిన్ సేవలు

థైరాయిడ్, బీపీ, షుగర్, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు, గర్భిణి, చిన్నారుల సమస్యలకు సంబంధించి టెలి మెడిసిన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో టెలి మెడిసిన్ హబ్ ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలు వైద్య నిపుణులు జనరల్ మెడిసిన్ డాక్టర్లు గైనకాలజిస్టు అందుబాటులో ఉంటూ టెలి మెడిసిన్ ద్వారా వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి చికిత్సను అందించేలా ఎంఎల్‌హెచ్‌పీలను ఆదేశిస్తారు. బాపట్ల జిల్లాలో ప్రస్తుతం నెలకి 5,500 మంది సేవలు పొందుతున్నారు.

ఉత్తమ సేవలు అందిస్తున్నాం..



గతంలో 1000 జనాభాకు ఆశ, ఐదు వేల జనాభాకు ఏఎన్‌ఎంలు ఉండేవారు. ప్రస్తుతం ఆ విధానానికి స్వస్తి చెప్పాం. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారిని ప్రభుత్వం సీహెచ్ఓలనుగా నియమించింది. ప్రతి 2500 మంది జనాభా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా ఉత్తమ సేవలందిస్తున్నాం. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

–ఎస్.విజయమ్మ, జిల్లా వైద్యాధికారి

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



బాపట్ల: మాదక ద్రవ్యాల నియంత్రణకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు నిరోధానికి డికాయ్ ఆపరేషన్ పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. కమిటీ పరిధిలో 14 బృందాలు జిల్లాలో డికాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామన్నారు. మూడు నెలలలో 14 గంజాయి కేసులు నమోదు అయినట్లు వివరించారు. జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ పని చేస్తుందన్నారు. బాపట్ల జిల్లా ఏర్పడిన నాటి నుంచి 96 గంజాయి కేసులు నమోదు కాగా, 2,728 కిలోల గంజాయిని ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసుల్లో 339 మందిని అరెస్టు చేశామని చెప్పారు. మరో ఐదుగురిపై పీడీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. బాపట్ల, చీరాలలో ముఖ్యంగా ఆటో డ్రైవర్లు, కూలీలు, గ్రానైట్ ఫ్యాక్టరీల వద్ద పనిచేసే కూలీలు వినియోగిస్తున్నారని చెప్పారు. అలాగే విద్యాసంస్థల వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించామని ఏఎస్పీ మహేష్, కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ సంకల్పం కార్యక్రమం కింద ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. గంజాయి పంట సాగుపై అటవీ శాఖ అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. డి ఎడిక్షన్ సెంటర్ బాపట్లలో ఏర్పాటయ్యేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యుల అనుమతి లేకుండా మందుల దుకాణాలలో డ్రగ్స్ విక్రయించరాదని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ పి.మహేష్, డీఆర్ఓ కె.లక్ష్మీశివజ్యోతి, బాపట్ల, చీరాల ఆర్డీఓలు జి.రవీందర్, పి.సరోజిని, సెబ్ అదనపు ఎస్పీ జి.నరసింహారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సూపర్ సక్సెస్

శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కోన



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: సమస్యలు సత్వర పరిష్కారానికి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాలు కొండుబోట్లవానిపాలెం, మూలపాలెంలో మంగళవారం నిర్వహించారు. డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. గతంలో ఎటువంటి సర్టిఫికెట్లు కావాలన్నా కార్యాలయాలు చుట్టూ తిరిగి ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు నేరుగా ప్రజల వద్దకు వచ్చి ఇస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ ఏ ఒక్కరూ సర్టిఫికెట్లు లేవని నష్టపోకూడదని ప్రతి ఇంటికి వలంటీర్లు వెళ్లి వారి సమస్యను తెలుసుకొని వెంటనే వారికి అవసరమైన ధ్రువపత్రాలు జారీ చేయడం గొప్పవిషయమని చెప్పారు. ప్రజలకు ఉచితంగా సేవలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం చక్కటి అవకాశం అన్నారు. ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ మాట్లాడుతూ మంగళవారం ఒక రోజే కొండుబొట్ల వానిపాలెంలో 2473 దరఖాస్తు చేసుకున్న వారికి, మూలపాలెం సచివాలయం పరిధిలో 2050 దరఖాస్తులు రాగా 1800 మందికి ధ్రువీకరణాల పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, జేసీఎస్ కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిన్ని పోయిన ప్రసాద్, బోలిమెర అనిల్ కుమార్, ఈఓపీఆర్డీ పులి శరత్ బాబు, బాపట్ల మండల రెవెన్యూ అధికారి సుధారాణి పాల్గొన్నారు.

డబ్బులు రావు.. అధికారులకు పట్టదు

- రెండేళ్లుగా నత్తనడకనే విచారణ
- ఆందోళనలో వేటపాలెం సొసైటీ బాధితులు
- పక్కా ప్లాన్‌తోనే రూ.24 కోట్లు గోల్‌మాల్



పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు(ఫైల్)

వేటపాలెం: సొసైటీలో సొమ్ము గోల్‌మాల్ కేసు విచారణ నత్తనడకన సాగుతోంది. నెలంతా కష్టపడిన జీతంలో కొంత దాచుకొని, పిల్లల చదువు, పెళ్లిళ్లు, భవిష్యత్ అవసరాల కోసం నమ్మకం కొద్ది దాచుకున్న డబ్బును కొందరు అమాంతం దోచుకెళ్లారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.24 కోట్లు. బాధితుల్లో ఇప్పటికే 12 మంది ప్రాణాలు కోల్పోయారు. అనారోగ్యంతో మరి కొందరు మంచానపడ్డారు. దారి మళ్లించిన సొమ్ము బాధితుల దరికి చేర్చేదెప్పుడో అని బాధితులు ఎదురుచూస్తున్నారు. వేటపాలెం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీకి సంబంధించిన నిధులు గోల్‌మాల్ పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగింది. సొసైటీ కార్యవర్గం రూ.25 కోట్లు డిపాజిట్లుగా సేకరించారు. అయితే అందులో కేవలం రూ.15 లక్షలు మాత్రమే రుణాల రూపంలో ఇచ్చారు. మరి మిగిలిన రూ.24 కోట్లు సొమ్ము ఏమైనట్లు అని డిపాజిట్‌దారులు ప్రశ్నిస్తున్నారు. ఇది ముందస్తు ప్రణాళికంగానే జరిగిందని బాధితులు వాపోతున్నారు. తాము తెలియక మోసపోయామని లబోదిబోమని ఆవేదన పడుతున్నారు.

నత్తనడనకన విచారణ.. రికవరీ

2021 జూలైలో వేటపాలెం సొసైటీలో డిపాజిట్ల గోల్‌మాల్ వ్యవహారం వెలుగు చూసింది. అప్పట్లో ఆ శాఖ మంత్రి సొసైటీ నిధుల గోల్‌మాల్‌పై వేగవంతంగా విచారణ పూర్తిచేసి బాధితులకు సత్వరం న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు హడావుడిగా అప్పట్లో డైరెక్టర్లను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. అనంతరం వారంతా బెయిల్‌పై బయటికి వచ్చారు. జిల్లా సొసైటీ అధికారులు నిధుల గోల్‌మాల్‌పై విచారణ ప్రారంభించారు. విచారణ పూర్తి చేసి సంవత్సరం కిందట నివేదికను జిల్లా సొసైటీ అధికారులకు అందించారు. సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్ల ఆస్తులు జప్తు చేశారు. అయితే బాధితులు తమ దాచుకున్న డబ్బు కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్ర మంలోనూ, జిల్లా ఎస్పీ కార్యాలయంలో అనేక పర్యాయాలు వినతి పత్రాలు అందజేశారు. అప్పటి నుంచి రెండేళ్లగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే ఇంతవరకు గోల్‌మాల్ జరిగిన సొమ్ములో ఒక్కపైసా రికవరీ చేయలేదు. కేసు నత్తనడకన నడుస్తోందని, నిందితులుగా ఉన్న అప్పటి డైరెక్టర్లు మాత్రం వ్యాపారాలు చేసుకుంటున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాతృ మరణాలను జిల్లాలో పూర్తిగా అరికట్టాలి

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



మాతృమరణాలపై వైద్యశాఖ సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: మాతృ మరణాలను జిల్లాలో పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. మాతృ మరణాల పర్యవేక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృ మరణాల నియంత్రణపై వైద్యాధికారులు నిఘా ఉంచాలని కోరారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లా పరిధిలోని చీరాలలో ఒక గర్భిణి మృతి చెందడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి, వైద్యం అందించిన డాక్టర్ల వివరాలు, కేస్ షీట్ నివేదికలను పరిశీలించారు. పలువురు వైద్యాధికారులతో ఆయన చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు బాపట్ల జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కారాదని హెచ్చరించారు. అధికారుల పర్యవేక్షణ కొరవడితేనే ఇలాంటి ఘటనలు జరుగుతాయని పేర్కొన్నారు. గర్భిణులుగా నమోదైన నాటి నుంచి వారిని ప్రభుత్వ యాప్‌లో ట్రాక్ చేయాలని కోరారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ... వైద్య సూచనలు, సలహాలు అందించాలని చెప్పారు. చీరాలలో చోటుచేసుకున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు డాక్టర్ రామ కృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ చేద్దాం..

- సృజనకు పదును
- ప్రాజెక్టుల రూపకల్పనకు అవకాశం
- ఆగస్టు 31 వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు



ఇన్‌స్పైర్ లోగో

బాపట్ల అర్బన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనాక్ వేదికగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్స్ పేరిట విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తుంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం 2023–2024 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పేరిట నిర్వహించనున్న పోటీలకు దరఖాసులు ఆహ్వానిస్తున్నారు.

జిల్లాలోని పాఠశాలల నుంచి..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సైన్స్ ఉపాధ్యాయులతో కలసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా 1800 స్కూలు ఉన్నాయి. వీటిలో ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తగ్గకుండా దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా వ్యాప్తంగా ఐదు వేల నామినేషన్ స్వీకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందులో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్–డీఎస్టీ.జీఓవీ.ఇన్ అప్‌లోడు చేయాలి. ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు చక్కటి ఆలోచనతో డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్ స్పైర్ అవార్డు మనాక్ వెబ్సైట్లో అప్లోడ్ చేయాలి. ఇలా ఎంపికైన ప్రాజెక్టుకు పది వేలు వారి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. ఈ డబ్బులతో ఉపాధ్యాయుడు సహకారంతో విద్యార్థి ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా ప్రదర్శనకు రావాల్సి ఉంటుంది.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన మేదరమెట్ల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్(ఫైల్)

దరఖాస్తు ఎలా చేయాలంటే..

- తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యలపై ఆలోచన ఉండాలి.
- తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి అందుకు అవసరమైన ప్రాజెక్టు రూపొందించాలి.
- విద్యార్థి పేరు తండ్రి పేరు తరగతి విద్యార్థి బ్యాంకు ఖాతా ఆధార్ కార్డు ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు పేరు శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి
- ప్రాజెక్టుకు ఎంపిక రెండు నెలలు పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు
- ఎంపికైన ప్రాజెక్టును ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖాతాలో పదివేలు జమ చేస్తారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



ప్రాజెక్టుల తయారు చేసేలా విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి ఐదు వేల నామినేషన్లను చేయించేలా టార్గెట్ పెట్టుకున్నాం. పాఠశాల స్థాయిలో రూపొందించిన ప్రాజెక్టుల నుంచి ఎన్ఐఎఫ్ వారు కొన్నిటిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు.

– సాదిక్, జిల్లా సైన్స్ అధికారి బాపట్ల

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి నమూనాలను అప్లోడ్ చేయాలి. ముఖ్యంగా ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. సైన్స్ ఉపాధ్యాయుల ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

– పి.వి.జి.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

ఆలోచనలకు పదును



విద్యార్థులు తమ ప్రతిభ నేర్పించుకొని బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. ఆలోచనలకు పదును పెట్టి ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతం చేయాలి. ప్రాజెక్టుల రూపకల్పనపై త్వరలోనే సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తాం.

– వి.ఎస్.సుబ్బారావు, పాఠశాల విద్య ఆర్జేడీ

మామిళ్లపల్లిలో బజరంగ్ ఉచిత వైద్యశిబిరం

- హృదయ సంబంధ వ్యాధులకు పరీక్షలు
- 186 మందికి ఈసీజీ, 2డి ఎకో
- 37 మందికి యాంజియోగ్రామ్‌కు సిఫారసు
- నవయుగ దార్శనికుడు జగనన్న: ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



ముఖ్య అతిథిగా శ్రీశైల సారంగ నాథ పీఠాధిపతి హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజలకు అత్యున్నత స్థాయిలో మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాబోయే కాలంలో మరింత స్థిరంగా విజయాలను సాధిస్తూ కొనసాగనున్నదని, భగవంతుని ఆశీస్సులతో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకునిగా జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలవనున్నారని స్వామీజీ అన్నారు.

చేబ్రోలు: పొన్నూరు మండలం మామిళ్ల పల్లి గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మీ గుండె పదిలం కార్యక్రమంలో భాగంగా హృదయ సంబంధిత వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జగన్నామ సంక్షేమ సంవత్సరం సంక్షేమ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు వైద్య పరీక్షలు, వైద్య సహాయాన్ని బజరంగ్ ఫౌండేషన్ శిబిరాన్ని నిర్వహించింది. శిబిరంలో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎవరూ చేపట్టని విధంగా వైద్య సంస్కరణలు అమలు చేస్తున్న నవయువ దార్శనికుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిదాయకమైన కార్యాచరణ బజరంగ్ ఫౌండేషన్‌కు మార్గదర్శకమన్నారు. జగనన్న ప్రభుత్వ కార్యక్రమాలకు తోడుగా ప్రతి గ్రామంలో వైద్య, విద్యా సంబంధిత కార్యక్రమాలను చేపడుతున్నామని జగన్నామ సంక్షేమ సంవత్సరం కార్యక్రమాలలో భాగంగా మరిన్ని సేవా కార్యక్రమాలను రూపొందించామని, మరిన్ని గ్రామాలలో ప్రజలకు సేవలను అందించనున్నట్లు తెలిపారు. గ్రామ వలంటీర్ల సహాయంతో గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి గుండె సంబంధిత పరీక్షలను నిర్వహించి మందులను అందజేసే కార్యక్రమంలో సునాయసంగా జరిగిందన్నారు. వైద్య బృందం నిర్వాహకులు డాక్టర్ విజయచైతన్య, రాజేష్ తదితరులను ఘనంగా సత్కరించారు. వైద్య శిబిరం ముగింపు సభలో పాల్గొన్న గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన బజరంగ్ ఫౌండేషన్ సేవలను అభినందించారు. మెడ్ స్టార్ హాస్పిటల్ వైద్యబృందం వైద్య సేవలు అందజేసింది. శిబిరంలో 186 మందికి ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి, అవసరమైన 37 మందికి తదుపరి వైద్య పరీక్ష యాంజియోగ్రాం చేయించుకోవలసిన పరిస్థితిని నిర్ధారించారు. వారందరికీ పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్సలను అందించనున్నారు.


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, చిత్రంలో అంబటి మురళీకృష్ణ

సీఎం జగన్ పాలనలోనే సామాజిక న్యాయం

మంత్రి అంబటి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మంత్రి రాంబాబుతో కలసి మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నిమ్మకాయల ఆయనను దుశ్శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం 30వ తేదీన మిర్చియార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని చెప్పారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వెనుకబడిన వర్గాలను సాధికారిత దిశగా అడుగులు వేస్తే... ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మొత్తం వ్యవస్థలోనే మౌలిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి రాజ్యాధికారం దిశగా వారిని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకు అణగారిన వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ వంటి మహనీయులు ఆశించిన సామాజిక న్యాయాన్ని ఆచరణలో చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనని కొనియాడారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన బీసీ కమిషన్ ఏర్పాటు చేశారని, అంతేకాక మొత్తం 137 కార్పొరేషన్లకు సంబంధించి 484 పదవులు ఇస్తే... అందులో 243 బీసీలకు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఆసియాలోనే అతి పెద్దదైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) చైర్మన్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన నిమ్మకాయల రాజనారాయణను సీఎం వైఎస్ జగన్ నియమించటం సంతోషదాయకమన్నారు. డైరెక్టర్ల నియామకంలోనూ పూర్తి సామాజిక న్యాయాన్ని పాటించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని సత్కరిస్తున్న నిమ్మకాయల, పక్కన మంత్రి రాంబాబు

‘ప్లాపస్’తో సేవలు-వివాదాలకు సత్వర పరిష్కారం

సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ



తెనాలి: ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వివిధ రకాల సేవలు, ఆయా సంస్థలతో తమకు గల వివాదాలను ఎలాంటి కోర్టు ఫీజు, ఖర్చు లేకుండా ‘పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్’ (ప్లాపస్) ద్వారా సత్వరమే పరిష్కారం పొందవచ్చని తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. గుంటూరు జిల్లా కోర్టు ప్రాంగణంలోని ‘పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్’తో న్యాయసేవల అధికార చట్టం 1987, సెక్షన్ 22,ఎలో పేర్కొన్న రోడ్లు, నీరు, ఆకాశయాన రవాణా సంస్థల సేవలు, తంతి, తపాల సేవలు, విద్యుత్, కాంతి, ప్రజలకు నీరు సరఫరా చేసే అన్ని సంస్థల సేవలు, ప్రజా పరిరక్షణ లేక పారిశుధ్యంకు సంబంధించిన సేవలు, హాస్పిటల్ / డిస్పెన్సరీల సేవలు, బీమా సంస్థల సేవలు, బ్యాంకింగ్, ఇతర ఫైనాన్స్ సంస్థల సేవలు, విద్య, విద్యాసంస్థల సేవలు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, గృహ, రియల్ ఎస్టేట్ సేవలు, వివాదాలను ‘ప్లాపస్’తో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టులో వ్యాజ్యాం దాఖలు చేయకముందే, కోర్టుకు ప్రత్యామ్నాయంగా ఆయా వివాదాల పరిష్కారానికి ‘ప్లాపస్’ను సేవా వినియోగదారులు లేదా సంస్థలు ఆశ్రయించవచ్చని వివరించారు. ఆయా సేవలు / వివాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి ‘ప్లాపస్’ ప్రయత్నిస్తుందని, లేనిపక్షంలో ప్రవేశపెట్టిన సాక్ష్యాధారాలను అనుసరించి వివాదాలను పరిష్కరించి తీర్పు వెలువరిస్తుందని తెలిపారు. ఈ తీర్పుపై ఎలాంటి అప్పీల్ ఉండదన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమ విలువైన డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవాలని గీతాంజలి శర్మ సూచించారు.

మినీలారీ బోల్తా..రాకపోకలు బంద్

నరసరావుపేటరూరల్: నరసరావుపేట-పిడుగురాళ్ల మార్గంలో రావిపాడు సమీపంలోని శాంతినగర్ వద్ద మంగళవారం రాత్రి దాచేపల్లి నుంచి మిర్చిలోడుతో గుంటూరు వెళ్తున్న మినీలారీ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా కొట్టింది. రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు ఇక్కట్లకు గురయ్యారు. పోలీసులు లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పురందేశ్వరికి ఘనస్వాగతం


ర్యాలీగా వస్తున్న పురందేశ్వరి, బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి గుంటూరు విచ్చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి మంగళవారం బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద ఉన్న టోల్‌గేటు వద్ద నుంచి భారీ గజమాలతో, కార్లు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్లి ఆమెకు స్వాగతం పలికారు. కాజా టోల్‌గేట్ నుంచి గుంటూరులోని సిద్దార్థ గార్డెన్స్ వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడక్కడ బీజేపీ మహిళ నేతలు పురందేశ్వరి నుదుట తిలకం దిద్ది ఘస్వాగతం పలికారు.

యార్డుకు 34,959 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 34,959 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,777 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9 వేల నుంచి రూ.25 వేల వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.15,500 నుంచి 23,500 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 12 వేల నుంచి రూ. 25,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,115 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

హెచ్‌ఎంలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

ఆర్జేడీ సుబ్బారావు

బాపట్ల అర్బన్: పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా(సీమ్యాట్) ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు నాయకత్వ లక్షణాలపై రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకనుగుణంగా గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. బోధన పర్యవేక్షణా పద్ధతులు, పాఠ్యప్రణాళికలు ఐసీటీపై మాస్టర్ ఫెసిలిటీ ట్రైనర్స్ శిక్షణనిచ్చారు. శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకురాలు ప్రతిష్ట, అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ పాల్గొన్నారు.

వేమూరులో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం

బాపట్ల: బాపట్ల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధిక వర్షపాతం వేమూరులో 32.4 మిల్లీమీటర్లు నమోదు కాగా అత్యల్పంగా 4.2 మి.మీ. నమోదైంది. జిల్లా వ్యాప్తంగా చూస్తే చుండూరు మండలంలో 8, అమృతలూరులో 7.2, వేమూరు 32.4, కొల్లూరులో 16.2, భట్టిప్రోలులో 8.2, చెరుకుపల్లి 7.6, పిట్టలవానిపాలెంలో 12.6, కర్లపాలెంలో 8.2, బాపట్లలో 28.8, నిజాంపట్నంలో 13.8, నగరంలో 6.8, రేపల్లెలో 8.2, సంతమాగులూరులో 18.6, బల్లికూరవలో 4.8, మార్టూరులో 8.2, ఎద్దనపూడిలో 12, పర్చూరులో 15.2, కారంచేడులో 12.2, ఇంకొల్లులో 4.4, పంగులూరులో 6.2, అద్దంకిలో 9.4, కొరిశపాడులో 4.2, చీరాలలో 11.4, వేటపాలెంలో 6.2, చినగంజాంలో 5 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

టీడీపీ పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

- సీపీఎం రాష్ట్ర నాయకుడు మధు
- దేవరపల్లి భూముల కేసులో పర్చూరు కోర్టుకు హాజరు

పర్చూరు(చినగంజాం): టీడీపీ హయాంలో దేవరపల్లి దళితుల భూముల్లో గుంతలు తవ్విన విషయమై పోరాడిన తమపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.మధు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేవరపల్లి దళిత భూములకు సంబంధించిన కేసులో బాపట్ల జిల్లా పర్చూరు కోర్టుకు మంగళవారం హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో నీరు-చెట్టు కింద దేవరపల్లిలోని కృష్ణరాజు కుంటలోని దళితుల సాగు భూముల్లో బలవంతంగా గుంతలు తవ్వారని తెలిపారు. దీనిని అడ్డుకున్న తమపై అప్పటి ప్రభుత్వం అక్రమంగా ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, పెంట్యాల హనుమంతరావు ఉన్నారు.

పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలి: డీపీఓ రాంబాబు



పర్చూరు(చినగంజాం): పారిశుద్ధ్యం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, అధికారులను ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదులను పరిశీలించేందుకు దేవరపల్లి గ్రామానికి మంగళవారం వచ్చారు. అక్కడ బ్లీచింగ్ చల్లిన మురుగు కాల్వలు, రోడ్లను పరిశీలించి సర్పంచి, కార్యదర్శులతో చర్చించారు. గ్రామంలో మురుగు నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన పర్చూరు పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం మండలానికి రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించుకోవాలని సూచన చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గౌస్, దేవరపల్లి సర్పంచి లాజర్, ఉపసర్పంచి టీ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యం ద్వారా మేలు జాతి పశువులు

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ జి.విజయకుమార్

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): లింగ నిర్ధారిత వీర్యంతో చూడి కట్టించడం ద్వారా మేలు జాతి దూడలు పుట్టే అవకాశం ఉందని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ జి.విజయకుమార్ చెప్పారు. మండలంలోని లంకెలకూరపాడు గ్రామంలో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లింగ నిర్ధారిత వీర్యం ద్వారా చూడి కట్టిన పశువుల ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఎక్కువగా పెయ్య దూడలను పుట్టించడం వలన రైతులకు కావలసిన గేదెలను తయారు చేసుకోవచ్చన్నారు. పశువులపై పెట్టే ఖర్చు తగ్గుతుందన్నారు. దేశంలోనే మన రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై మొదటిసారిగా చేపట్టిందన్నారు. పల్నాడు జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డితో కలిసి ప్రారంభించారు. పల్నాడు జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి కె.కాంతారావు, నరసరావుపేట పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ నరసింహులు, సత్తెనపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకరరెడ్డి, ముప్పాళ్ల, మాదల పశువైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లంకెలకూరపాడులో పశుప్రదర్శనను ప్రారంభిస్తున్న విజయకుమార్ తదితరులు

గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెనమలూరు: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ బుధవారం గంగూరు గ్రామ పర్యటన సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ రాజాబాబు ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు రైతుభరోసా కేంద్రాల్లో ప్రదర్శించాలని సూచించారు. గవర్నర్, రైతులతో ముఖాముఖి మాట్లాడటానికి ఏర్పాట్లు చేయాలని, రైతులు పొందిన పథకాలు వివరించాలని తెలిపారు. వర్షాలు పడుతుండటంతో సభా ప్రాంగణాన్ని భారీ టెంట్లతో నిర్మించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయ్‌కుమార్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి పద్మావతి, జిల్లా వైద్యాధికారి గీతాబాయ్, జిల్లా ఉద్యానవన అధికారి జె.జ్యోతి, డీఆర్డీఏ పీడీ ప్రసాద్, పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ దివాకర్, తహసీల్దార్ శివయ్య, ఎంపీడీఓ సునీతాశర్మ తదితరులు పాల్గొన్నారు.


గంగూరులో గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హైదరాబాద్‌లో ప్రమాద ఘటన

బాపట్ల: ఉపాధి కోసం ఊరు వదిలి వెళ్లిన యువకుడు హైదరాబాద్‌లో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. వివరాలు.. బాపట్ల మండలం నరసాయపాలేనికి చెందిన చెల్లి ఆకాష్(21) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఈవెంట్స్ చేసుకుంటూ ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇటీవల నరసాయపాలెం వచ్చిన ఆకాష్ ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఉండమని చెప్పిన ఈవెంట్ ఉందంటూ వెళ్లాడు. రాత్రి పని ముగించుకుని స్కూటీపై ఇంటికెళుతున్న సమయంలో స్కూటీ స్కిడ్ అయిపడ్డాడు. దీంతో బలమైన గాయాలైన ఆకాష్‌ను ఆలస్యంగా గుర్తించిన స్థానికులు అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండగా తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆకాష్ అక్క చదువుకుంటుంది. కుటుంబ మొత్తానికి ఆధారమైన ఆకాష్ మృతి చెందటంతో కుటుంబంతో పాటు నరసాయపాలెం గ్రామంలో మొత్తం విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.


చెల్లి ఆకాష్(ఫైల్)

బైక్ ఢీకొని వృద్ధుడు దుర్మరణం


మేదరమెట్ల: ఎదురు ఎదురుగా వస్తున్న బైకు, మోపెడ్ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని కృష్ణంరాజువారి పాలెం(రెడ్డిపాలెం) పాత మద్రాసు రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. చందలూరు గ్రామానికి చెందిన పెంట్యాల జనార్ధన్‌రావు(60) భార్యతో కలసి మోపెడ్‌పై చందలూరు నుంచి ఒంగోలు వెళ్తున్నాడు. రెడ్డిపాలెం రోడ్డు సమీపానికి రాగానే ఒంగోలు వైపు నుంచి అతివేగంగా వచ్చిన బైకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. దీంతో జనార్ధన్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య గాయపడింది. సమాచారం అందుకున్న కొరిశపాడు ఎస్ఐ జీవీ చౌదరి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన మహిళను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ జీవీ చౌదరి

31లోపు ఈకేవైసీ చేయించండి

నరసరావుపేట: జిల్లాలో ప్రధానమంత్రి కిసాన్ యోజన ద్వారా లబ్ధి పొందే రైతులు అందరూ ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మంగళవారం పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో లబ్ధి పొందుతున్న వారు 2,10,763మంది ఉండగా 26,168మంది ఇంకనూ ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. రాబోయే లబ్ధి చేకూరాలాంటి తప్పకుండా వీరందరూ బయోమెట్రిక్, ఫోన్ ఓటీపీ లేదా ముఖ చిత్రం ద్వారా ఈకేవైసీ చేయించాలన్నారు. ఆర్‌బీకేలలో పనిచేస్తున్న వలంటీర్లు, వ్యవసాయ సహాయకులు, గ్రామసచివాలయ సిబ్బంది లేదా మండల వ్యవసాయాధికారి ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే 83310 56916, 83310 56911, 83310 56905లను సంప్రదించాలని కోరారు.

జాతీయ జూనియర్ త్రోబాల్ పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్ల క్రీడాకారులు

తెనాలి: తమిళనాడు రాష్ట్రంలోని తిరుపూర్‌లో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న 31వ జాతీయ జూనియర్ బాలబాలికల త్రోబాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక వివేకానంద సెంట్రల్ స్కూల్ క్రీడామైదానంలో ఎంపికలు జరిగాయి. అనంతరం బాలబాలికల జట్లను ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులకు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, జాన్ కీట్స్, రావిపాటి వీరానాయణ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన తెనాలి రోటరీ క్లబ్ సభ్యులను అభినందించారు. ఎంపికైన జట్ల వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్ర బాలికల జట్టు: పి.యామిని, ఎల్.సుష్మశ్రీ, సి.కల్పన (గుంటూరు), ఎస్.షైఫా అంజుమ్ (అనంతపూర్), టి.ఐశ్వర్య, యు.త్రివేణి, బి.శిరీష, టి.నీరజ (చిత్తూరు), సీహెచ్ సునీత, డి.చందన, ఎం.తేజశ్రీ (విశాఖ), టి.అంజలి (నెల్లూరు), స్టాండ్‌బైలుగా ఎస్.శ్రీలిఖిత (విశాఖ), ఎంఎం రితిఖ (అనంతపూర్), సౌమ్య (నెల్లూరు).

రాష్ట్ర బాలుర జట్టు: జి.మధు, వై.నాగమల్లికార్జున, పి.ఆకాష్‌బాబు (గుంటూరు), సి.పురుషోత్తం, బి.తేజో (చిత్తూరు), బి.ముకేష్‌కుమా ర్, ఈ.మనోజ్‌కుమార్, ఎం.జైసా యి (విశాఖ), బి.రవితేజ, టి.రత్నకుమార్, జె.రాజేష్ (పశ్చిమగోదావరి), రక్షిత్‌కుమార్ (అనంతపూర్), స్టాండ్‌బైలుగా సి.యశ్వర్ధన్(అనంతపూర్), జె.జయశ్రీవర్ధన్ (విశాఖ), వై.జీవన్ కుమార్ (నెల్లూరు).

హెచ్‌ఎంఐఎస్ పోర్టల్‌పై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(హెచ్‌ఎంఐఎస్) పోర్టల్‌పై మంగళవారం పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయానికి చెందిన గణాంక అధికారి వి.వి. ప్రసాద్ పాల్గొని వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా పోర్టల్ గురించి వివరించారు. ఆ పోర్టల్ నిర్వహణలో ఇటీవల జరిగిన మార్పులకు అనుగుణంగా పట్టణ, గ్రామీణ ప్రాంత వైద్యాధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి పోర్టల్ నిర్వహణలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశంగా ప్రగతి సాధించి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయ గణాంక అధికారి ఎస్.లక్ష్మోజీ, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్ పాల్గొన్నారు.